ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

మంగళవారం 28 అక్టోబరు 2025



4న యువజనోత్సవాలు

బెలగాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 4న జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు సెట్విజ్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి వి.విశ్వేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద గీతాలు, నృత్యాలు, పెయింటింగ్, కవిత్వం, స్టోరీ రైటింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు యువతీ, యువకులు ఇందులో పాల్గొనొచ్చని తెలిపారు. జిల్లా యువజన సర్వీస్ శాఖ, సెట్విజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



ఈదురు గాలులకు గరుగుబిల్లిలో నేలవాలిన వరి పంట

తుఫాన్ గుబులు



- ముంచుకొస్తున్న 'మొంథా' ● తొలిరోజు జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు
- నేడు ఈదురుగాలులతో భారీగా కురిసే అవకాశం
- రైతుల్లో టెన్షన్.. పంటలను కాపాడుకునే పనిలో నిమగ్నం
- జలాశయాలకు వరద ● అప్రమత్తమైన అధికార యంత్రాంగం

పార్వతీపురం/టౌన్/సాలూరు/సీతంపేట అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం చిరుజల్లులు కురిశాయి. స్వల్పంగా గాలులు వీచాయి. అయితే సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారింది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురిశాయి. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప బయటకు రావడానికి సాహసించలేదు. కాగా మంగళవారం పరిస్థితి పూర్తిగా మారనుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈదురు గాలులతో భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. సాలూరులో ఉదయం నుంచి తేలికపాటి జల్లులు కురవగా.. పలు పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా మార్చారు. పూరిళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. తుఫాన్ హెచ్చరికల వల్ల పార్వతీపురం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముంపు సమస్యను ఎలా ఎదుర్కోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

వర్షపాతం నమోదు ఇలా..

పాలకొండ: జిల్లాలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ 5.2 మిల్లీమీటర్లు, సీతంపేట 3.2, వీరఘట్టం 5.4, గుమ్మలక్ష్మీపురం 2.4, భామిని 7.8, జియ్యమ్మవలస 4.6, కురుపాం 1.6, పార్వతీపురం 7, కొమరాడ 3.4, గరుగుబిల్లి 12.8, మక్కువ 8, సీతానగరం 8.8, సాలూరు 5, బలిజిపేట 10.4, పాచిపెంట 5.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ఏజెన్సీలో..

సీతంపేట ఏజెన్సీలో చిరుజల్లులు కురిశాయి. అయితే సాయంత్రానికి కుండపోత వర్షం కురిసింది. మరోవైపు మండల స్థాయి అధికారులు గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు అప్రమత్తం చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. సాలూరు మండల పరిధి ఏవోబీ కొఠియా కొండల్లో భారీ వర్షం పడింది. వీరఘట్టం, మక్కువ మండలాల్లోని పలు గ్రామాల్లో ఉదయం పది గంటల నుంచి రాత్రి వరకూ జోరు వాన కురిసింది. తుఫాన్ వల్ల ఎటువంటి నష్టం జరగ కుండా అధికారుల బృందం విస్తృతంగా పర్యటించి ప్రజలకు జాగ్రత్తలు సూచించారు.

అన్నదాతల్లో ఆందోళన

గరుగుబిల్లి/పాలకొండ: 'మొంథా' తుఫాన్ రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో



పాలకొండ: పంటపై టార్పాలిన్ కప్పి దీనంగా కూర్చున్న రైతు

చేతికందొచ్చిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. సోమవారం పాలకొండ మండలంలో పలువురు రైతులు ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేయించి కాకినాడ తదితర ప్రాంతాలకు తరలించారు. మరికొందరు ధాన్యంపై టార్పాలిన్లు కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. ఏదేమైనా సోమవారం సాయంత్రం నుంచి ఓ మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మరింతగా టెన్షన్

(మిగతా 8వ పేజీలో...)

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలోకి సోమవారం పైప్రాంతాల నుంచి 3,900 క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు 5,500 క్యూసెక్కులను విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.14 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది.

వీఆర్ఎస్‌కు వరద

మక్కువ రూరల్: శంబర సమీపంలో ఉన్న వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) జలాశయం నుంచి సోమవారం 1000 క్యూసెక్కులను సువర్ణముఖి నదిలోకి విడుదల చేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలో వరద పెరుగుతోందని అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్ తెలిపారు.



వీఆర్ఎస్ నుంచి నదిలోకి వరద నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

శివోహం

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో కార్తీక తొలి సోమవారం పూజలు



సాలూరు: పంచముఖేశ్వర ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు



పార్వతీపురం రూరల్: అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద ఉన్న కొండపై శివయ్య విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

శివాలయాలకు కార్తీక తొలి సోమవారం భక్తులు పోటెత్తారు. అంతటా శివనామస్మరణ మార్మోగింది. ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. దీపారాధనలు, అభిషేకాలతో ఆలయ ప్రాంగణాలన్నీ కార్తీక శోభను సంతరించుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. ఉపవాసం కూడా పాటించారు. పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, విశిష్ట అర్చనలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి క్యూలైన్లో ఉన్నారు. పురాతన శివాలయాల వద్ద ఎక్కువ సంఖ్యలో భక్తులు కనిపించారు. ఈశ్వర మాలధారణ చేసిన భక్తులు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- పూర్తి వివరాలు 6వ పేజీలో..

సమస్యలు తెలియజేయండి

- జిల్లా ప్రత్యేకాధికారి నారాయణభరత్‌గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి

పార్వతీపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఎక్కడ ఎంత చిన్న సమస్య తలెత్తినా తమ దృష్టికి తేవాలని జిల్లా ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్తా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్ కలెక్టర్లు మంగళవారం ముంపు ప్రభావత ప్రాంతాల్లో పర్యటించాలన్నారు. రహదారులపై చెట్టు కొమ్మలు పడితే తక్షణమే వాటిని తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. బోట్లు సిద్ధం చేసుకోవాలని, రాత్రివేళల్లో రహదారి ప్రమాదాలకు అవకాశం ఉన్న చోట్ల ప్రజలను అలర్ట్ చేయాలని తెలిపారు. గ్రామంలో ఏదైనా జరిగితే వెంటనే గుర్తించి స్థానిక నాయకులు, యువత ద్వారా సమాచారం సేకరించాలన్నారు. పోలీస్ అధికారి, ఎంపీడీవో, తహసీల్దార్ ఒక్కచోటే ఉండాలని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. గూగుల్ లొకేషన్ ద్వారా కాజ్‌వేలు, కల్వర్టులకు లింక్ చేసుకోవాలని, ముంపు ప్రాంతాలను సర్వే చేసి నివేదిక అందించాలని సూచించారు. శిథిల భవనాలను గుర్తించి ఎవరూ లేకుండా చూడాలని, ప్రజల నుంచే వచ్చే ఫోన్లకు స్పందించాలని ఆదేశించారు. తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వసతిగృహాలు, పాఠశాలలకు నోడల్ ఆఫీసర్లను నియమించాలన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రక్షిత పథకాలను నీటితో నింపి ఉంచాలని, వసతిగృహాల్లో విద్యార్థులను బయటకు రాకుండా చూడాలని సూచించారు. సచివాలయ పరిధిలో జరిగే విషయాలను ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు.

ఖైదీలను సక్రమంగా చూడండి 8లో

ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన 6లో

గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తాం
● ప్రభుత్వ విప్ జగదీశ్వరి 8లో

200 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

నూతన వ్యవస్థకు శ్రీకారం

- వచ్చే నెల 1న డీడీవో కార్యాలయాలు ప్రారంభం
- రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఏర్పాటుకు నిర్ణయం
- ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం సన్నద్ధం



మెంటాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో కొత్త పాలనావ్యవస్థ పురుడుపోసుకోనుంది. నవంబరు 1 నుంచి ప్రాంతీయ అభివృద్ధి అధికారి(డివిజనల్ డవలప్‌మెంట్ ఆఫీసర్-డీడీవో) కార్యాలయాలు ప్రారంభానికి రంగం సిద్ధమైంది. స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ తీసుకొచ్చిన పాలనాపరమైన సంస్కరణల ఫలితాలు ప్రజలకు సక్రమంగా అందించడంతోపాటు వారికి మెరుగైన సేవలు అందేలా చూడడం వీటి ఉద్దేశం. నవంబరు 1న రాష్ట్రవ్యాప్తంగా డీడీవో కార్యాలయాల ప్రారంభానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. యంత్రాంగం అందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినా పర్యవేక్షణను గాలికొదిలేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి పట్టాలు తప్పింది. పట్టణ, స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయి. పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీన్ని గాడినపెట్టాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టి సారించారు. ఇందులో తొలి అడుగుగా రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ విధానాన్ని రద్దుచేసి 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లుగా మార్చారు. పంచాయతీల బలోపేతానికి ఒక్కో అడుగు ముందుకు వేస్తున్న క్రమంలో డీడీవో వ్యవస్థను తీసుకొస్తున్నారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో డీడీఓ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. తాజాగా

(మిగతా 8వ పేజీలో...)

అన్నదాతలో వర్రీ
● గాలులకు ఉమ్మడి జిల్లాలో నేలకొరిగిన వరి పంట 6లో

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి
● డీఆర్వో హేమలత 6లో

ఏనుగుల స్వైర విహారం
● సోమినాయుడువలస నుంచి దుగ్గికి చేరిన గజరాజులు 6లో

మరో మూడు నెలలు

- అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ గడువు పెంపు
- తాజాగా జీవో జారీ

బొబ్బిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీము (ఎల్ఆర్ఎస్) గడువు ఈ నెల 23తో ముగిసిన నేపథ్యంలో ఆ గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. 2026, జనవరి 23 వరకు ఎల్ఆర్ఎస్ గడువును పొడిగించడంతో సంబంధిత భూ యజమానులంతా ఈ అవ కాశాన్ని వినియోగించుకోవచ్చు. 2020లో అనధికార లేఅవుట్స్, ప్లాట్ల క్రమబద్ధీకరణకు జారీ అయిన జీవోలు 1, 2 లకు అనుగుణంగా ఈ కొత్త జీవో వర్తిస్తుంది. ఎల్ఆర్ఎస్ పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజులో మినహాయింపు ఉంటుంది. సాధారణంగా మున్సిపాలిటీకి 14 శాతం ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఎల్ఆర్ఎస్ సదుపాయాన్ని వినియోగించుకుంటే అందులో సగం ఏడు శాతం

(మిగతా 8వ పేజీలో...)

ఆకట్టుకున్న 'ఓపెన్ హౌస్'



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డాగ్ విన్యాసం



పోలీసులు వినియోగించే తుపాకులపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

బెలగాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం 'ఓపెన్ హౌస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన డాగ్ షో విన్యాసాలు, పోలీస్ బ్యాండ్ బృందం ప్రదర్శన అందర్నీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు.. పోలీస్ విధుల్లో ఉపయోగించే ఆయుధాలు, తుపాకులు, సమాచార వ్యవస్థ, రక్షణ కోసం ఉపయోగించే పరికరాలపై ఎస్పీ మాధవరెడ్డి వివరించారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల జీవితం నాశనం అవుతుందని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిస అయినా, అక్రమ రవాణాకు పాల్పడినా, విక్రయించినా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో లేదా 1972 నంబర్‌కు ఫోన్‌చేయాలన్నారు. సైబర్ నేరాల బారిన పడితే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అంతకు ముందు 'పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర' అనే అంశంపై జిల్లా పోలీస్ సిబ్బందికి వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రస్తుత కాలంలో సీసీటీవీ సర్వైలెన్స్, సైబర్ క్రైమ్ దర్యాప్తులు, డ్రోన్ పోలీసింగ్, సీసీటీఎన్ఎస్, డిజిటల్ ఆధారిత నేర నియంత్రణ పద్ధతులపై పలువురు తమ అభిప్రాయాలను తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, సీఐలు మురళీధర్, రంగనాథం, రమేష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

సీతానగరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. సోమవారం సీతానగరం పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న మందులు, ఇంజక్షన్లపై ఆరా తీశారు. తుఫాన్ నేపథ్యంలో అత్యవసర చికిత్స నిర్వహణ విధానంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రసవ సమయానికి దగ్గర్లో ఉన్న గర్భిణులను ముందస్తుగా ఆసుపత్రుల్లో చేర్పించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, డీపీఎంవో రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గాలులు కూడా వీయడంతో గింజ కట్టిన వరి పంట నేలవాలుతోంది. పొలాలను చూస్తున్న అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కురిసిన వర్షాలకు చాలా చోట్ల పంట పొలాల్లో వరి కంకులు ఓ వైపు వాలిపోయాయి. వాటిని నిలబెట్టేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం చెబుతుండడం అందరినీ కలవరపరుస్తోంది. మరోవైపు వ్యవసాయ అధికారులు పంటపొలాలను పరిశీలిస్తూ రైతులకు సంరక్షణ చర్యల గురించి వివరిస్తున్నారు. వచ్చే రెండు రోజులు గాలులు తీవ్రంగా లేకుంటే పెద్దగా సమస్య రాబోదని చెబుతున్నారు.

అన్నదాతలో వర్రీ

- నేలకొరిగిన వరి పంట

రేగిడి/ గరివిడి/ గుర్ల/ బొండపల్లి: మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు చోట్ల వరి పంట నేలకొరిగింది. ఆయా ప్రాంతాలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.


రేగిడి: నాయిరాలవలసలో రైతులను అప్రమత్తం చేస్తున్న అధికారి


గుర్ల: రెడ్డిపేటలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు


బొండపల్లి: గొట్లాంలో నేలకొరిగిన వరి పంటను చూస్తున్న రైతు


భూతాదవలస వద్ద రోడ్డులో మొక్కజొన్నలపై కప్పిన పరదాలు

కొఠియాలో భారీ వర్షం

సాలూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సాలూరు ఏజెన్సీలో తూర్పు కనుమలతో నిండిన ఏవోబీలో కొఠియా కొండల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. కొఠియా, గంజాయిభద్ర, గాలిగబడారు, ఎగువశెంబి, దిగువశెంబి తదితర గ్రామాలో మైదాన గ్రామాలైన మరిపిల్లి, అన్నంరాజువలస, మామిడిపల్లి, దండిగాం, కురుకూటి, కూర్మరాజుపేట, బాగువలస, శివరాంపురం తదితర గ్రామాల్లో తుఫాన్ వల్ల ఎటువంటి నష్టం జరగకుండా ఎంపీడీవో గొల్లపల్లి, తహసీల్దార్ కె.నీలకంఠరావు, నియోజకవర్గ మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమార్, ఎస్ఐ నరసింహమూర్తి తదితరులు పర్యటించారు. లక్ష్మీపురం వద్ద వెంగళరాయసాగర్ ఆనకట్ట పరిస్థితిని అధికారుల బృందం పరిశీలించింది. వ్యవసాయాధికారి కె.శిరీష పర్యటించి రైతులకు పంటల సంరక్షణకు పలు సూచనలు చేశారు.

కంట్రోల్ రూమ్‌లు పరిశీలన

- విధుల కేటాయింపుపై కలెక్టర్ అసంతృప్తి

గంట్యాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో గంట్యాడ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంలో విధుల కేటాయింపుపై కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కంట్రోల్ రూంను పరిశీలించారు. కంట్రోల్ రూంలో సిబ్బంది విధులను సక్రమంగా కేటాయించాలని, వచ్చిన ఫిర్యాదులు నమోదు చేయడానికి ఒకరు, చేపట్టిన చర్యలు తెలియజేయడానికి ఒకరు చొప్పున ఇద్దరేసి సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. వారికి కేటాయించిన సమయంలో వారే విధులు నిర్వహించాలని ఆదేశించారు. లోపాలను సరిదిద్ది నివేదిక సమర్పించాలన్నారు. కార్యాలయం బయట కంట్రోల్‌రూంకు సంబంధించి సమాచార ఫ్లెక్సీని ఏర్పాటుచేయాలని సూచించారు.


గంట్యాడ: తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

- జామి: అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణంరాజుకు సూచించారు.
- శృంగవరపుకోట: అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సుచించారు. సోమవారం ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి.. తహసీల్దార్ శ్రీనివాసరావుతో చర్చించారు.

అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఎక్కడా ఎటువంటి నష్టం జరగకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ముంపు సమస్య ఉన్న వారిని కేంద్రాలకు తరలించాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలకు బయటకు రావొద్దని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మండల ప్రత్యేకాధికారి విమలకుమారి, మాజీ మండల అధ్యక్షుడు బోడసింగి సత్తిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి పెద్దింటి మోహన్, అధికారులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్

ఎవరూ ఆందోళన చెందవద్దు


లచ్చందొరపాలెంలో గిరిజన కుటుంబాలతో మట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దని.. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేశారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మూలబొడ్డవర, లచ్చందొరపాలెం గ్రామాల్లో టీడీపీ నాయకుడు ఇందుకూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఆమె సోమవారం పర్యటించారు. గిరిజన కుటుంబాలను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్‌తో సమావేశమయ్యారు. గోస్తనీ పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, చెరువుల గండ్లు విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు, నాయకులు కోటీ పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన



రాజాం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షానికి రాజాం పట్టణంలోని రహదారులు, వీధులు నీటితో నిండాయి. స్థానికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల కూరగాయల పంటకు నష్టం వాటిల్లింది. తహసీల్దార్ రాజశేఖర్ వీఆర్వోలతో సమీక్షించారు. పాత బస్టాండ్‌లో మురుగునీటిలోనే కూరగాయల అమ్మకాలు జరిగాయి.

← ప్రధాన రహదారి పరిస్థితి ఇలా..


బురద నీటి వద్దే కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

గేట్లు తెరిచారు



వంగర, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో స్థానిక అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే మడ్డువలస స్పిల్ వేను సందర్శించి.. రిజర్వాయర్‌లోని ఇన్‌ఫ్లోను పరిశీలించారు. ఇన్‌ఫ్లో పెరుగున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా రెండు గేట్లు తెరిచి నీటిని నాగావళికి విడుదల చేశారు.

సిద్ధంగా పునరావాస కేంద్రాలు

భోగాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో తీర ప్రాంత గ్రామాలైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరుల్లో ఎంపీడీవో డీడీ స్వరూపరాణి, డీటీ హరి ఆధ్వర్యంలో పునరావస కేంద్రాలు సిద్ధం చేశారు. ఈ కేంద్రాల్లో తాగునీటితో పాటు అన్ని సరుకులను సిద్ధంగా ఉంచారు. అలాగే పోలిపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.


పునరావస కేంద్రంలో సిద్ధంగా ఉన్న సరుకులు


పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

ఏనుగుల స్వైరవిహారం

కొమరాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్తాం కొండల్లోని ఏనుగుల గుంపు సోమవారం సాయంత్రానికి సోమినాయుడువలసకు చేరుకుంది. పంట పొలాలకు ధ్వంసం చేశాయి. దీంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఏనుగులు నష్టం సృష్టిస్తున్నా అధికారులు ఎవరూ పర్యవేక్షణకు రాకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టమాటా అరటి, వరి, పత్తి పంటల్లో ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తక్షణమే ఏనుగులు గుంపును తరలించి రైతులను ఆదుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. కాగా సోమవారం రాత్రికి రైల్వే ట్రాక్ దాటి దుగ్గి గ్రామ పరిసరాల్లోకి చేరుకున్నాయి.


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం

కూలిన భారీ వృక్షం

తెర్లాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెరుమాళి సమీపంలో రోడ్డుపై తుఫాన్ ప్రభావంతో సోమవారం భారీ వృక్షం కూలింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అప్రమత్తమైన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది భారీ వృక్షాన్ని తొలగించే ఏర్పాటు చేశారు. రాకపోకలు పునరుద్ధరించారు.

నీట మునిగిన పత్తిపంట

రామభద్రపురం: తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు పత్తిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొండకెంగువ రోడ్డులోని పత్తి పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పత్తికాయలు పూర్తిగా కుళ్లిపోయి ఆవేదనలో ఉన్న అన్నదాతకు ఈ తుఫాన్ మరింత నష్టాన్ని కలిగించింది.


నీటమునిగిన పత్తిచేను

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి హేమలత

పార్వతీపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారదర్శకమైన ఓటర్ల జాబితాకు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత కోరారు. సోమవారం తన చాంబర్‌లో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా డీఈవో, ఈఆర్‌వో స్థాయిలో అన్ని పార్టీ సమావేశాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాను తయారు చేయడంలో బీఎల్‌వోలతో సహకరించాలన్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాలకు సంబంధించిన సూచనలు, ఓటర్ల జాబితా నాణ్యత, స్వచ్ఛతను మెరుగుపర్చడానికి సూచనలు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఏడు రోజుల కంటే ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్న అన్ని ఫారాలను క్లియర్ చేయాలన్నారు. ఈఏడాది జనవరి 6 నుంచి ఇప్పటివరకు 6,993 దరఖాస్తులు స్వీకరించగా అందులో 165 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 799 దరఖాస్తులను రిజక్ట్ చేసినట్టు తెలిపారు.

ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన

- పోస్టర్ ఆవిష్కరణ

పార్వతీపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్ విద్యుత్ కార్యాలయంలో సోమవారం ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లింపునకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం పార్వతీపురం మన్యం విద్యుత్ శాఖ ఎస్ఈ కె.మల్లిఖార్జునరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత సులభమైన పద్ధతిలోలో బిల్లులను చెల్లించేందుకు ఏపీఈపీడీసీఎల్ పలు యాప్‌ల ద్వారా బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుందని వివరించారు. విద్యుత్ బిల్లుపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అత్యంత సులభ తరంగా విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు నన్నారు. దీనితో అదనపు భారం పడదన్నారు. వినియోగదారులు పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు పురుషోత్తం, గోపాలనాయుడు, రాజేంద్రప్రసాద్, వి.రంగారావు, శంకరరావు, గంటి శ్రీనివాసరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

శివోహం

- శివాలయాల్లో భక్తుల రద్దీ

కార్తీక మొదటి సోమవారం జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే శివాలయాల్లో దర్శనానికి బారులు తీరారు. శివునికి అభిషేకాలు చేశారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, ఎస్.కోట తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. - ఆంధ్రజ్యోతి బృందం


పార్వతీపురం టౌన్: ఉమామార్కేండేయ స్వామి ఆలయంలో..


గరుగుబిల్లి: గిజబ శివాలయంలో బారులుదీరిన భక్తులు


ఎస్.కోట రూరల్: సన్యాసయ్యపాలెంలో సన్యాసేశ్వరస్వామి ఆలయంలో..


మక్కువ రూరల్: ములక్కాయవలసలోని కాశీవిశ్వేశ్వరాలయంలో..


వంగర: సంగాం సంగమేశ్వర ఆలయం వద్ద బారులుతీరిన బక్తులు


సాలూరు రూరల్:మామిడిపల్లిలో శివపూజలో పాల్గొన్న భక్తులు


భోగాపురం శివాలయంలో పూజలు


బొండపల్లి: గెద్దపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు


చీపురుపల్లి: కొత్తఅగ్రహారం శివాలయంలో దీప దానాలు చేస్తున్న భక్తులు


గజపతినగరం: మరుపల్లి శివాలయంలో భక్తుల పూజలు

వెల్‌నెస్ కేంద్రం ప్రారంభం



వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని బొల్లివీధి సమీపంలో ఏర్పాటుచేసిన వెల్‌నెస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారుకు శంకుస్థాపన

భోగాపురంలోని వాటర్ ట్యాంకు సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో రైతు బజార్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇక్కడ రైతుబజారు అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని ఆమె అన్నారు.

వసతిగృహం సందర్శన

గంట్యాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు సోమవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. వార్డెన్ జి.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఐక్యరాజ్యసమితి సదస్సుకు చిట్టిబాబు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఖతర్ దేశం దోహాన్‌లో నిర్వహించే రెండవ అంతర్జాతీయ సామాజిక అభివృద్ధి సదస్సుకు నగరంలోని డీబీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు హాజరవుతున్నారు. వచ్చే నెల 4, 6 తేదీల్లో ఈ సదస్సు జరుగనుంది. ప్రపంచంలో నెలకొన్న అసమానతలు, పేదరికం, ఆకలిచావులు, వివక్షత, ఆర్థిక విధానాలు తదితర వాటిపై ఈ సదస్సులో చర్చించనున్నారు.

కేజీబీవీ పరిశీలన

రేగిడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుదళ కేజీబీవీని తహసీల్దార్ కృష్ణలత, ఎంపీడీవో శ్యామాలకుమారిలు సోమవారం సందర్శించారు. వసతిగృహం నిర్వహణ, శానిటేషన్‌పై ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి, సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. పునరావాస కేంద్రం ఏర్పాటు దృష్ట్యా పాఠశాలలో మౌలిక సౌకర్యాలు మెరుగ్గా ఉంచాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్ఐ గిరి, అసిస్టెంట్ రాజు ఉన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

రాజాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు డిసెంబరు 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక రైస్‌మిల్లు వద్ద కార్మికులతో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైస్‌మిల్లు నాయుకులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు

రాజాం రూరల్, అక్టోబు 27(ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిస కావొద్దని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. శ్యాంపురం గ్రామంలో ఆదివారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. గ్రామపెద్దలు, యువతతో సమావేశమయ్యారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదానికి మద్యం మత్తులో వాహనాన్ని నడిపిన ఓ యువకుడే కారణమని సీఐ గుర్తుచేశారు. వివాదాల జోలికి పోవద్దని సూచించారు.

ఏజెన్సీలో పోలీసుల పర్యటన

ఎస్.కోట రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల శివారు అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో ఎస్.కోట పోలీసులు సోమవారం పర్యటించారు. సీఐ నారాయణమూర్తి ఆదేశాల మేరకు ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో అటవీ ప్రాంతం ఉన్న గ్రామాలకు వెళ్లి.. తుఫాన్ హెచ్చరికలు వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

భోగాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.6.47 లక్షల విలువగల చెక్కులను మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సోమవారం పోలిపల్లి గ్రామంలో ఆరుగురు బాధితులకు అందజేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా హరికిరణ్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న విజయభాస్కర్ ఇటీవల దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీంతో ఆ ఇన్‌చార్జి బాధ్యతలను గంట్యాడ హెచ్‌డీటీ హరికిరణ్‌కు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పాడిరైతు కుటుంబానికి సాయం

వేపాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భర్తవానిపాలెం పాల ఉత్పత్తిదారుల సంస్థ పాల ఉత్పత్తిదారుడు దేవుపల్లి సత్యనారాయణ సహజ మరణం పొందడంతో విశాఖ డెయిరీ సంక్షేమ నిధి నుంచి రూ.30వేలను చెల్లించారు. సోమవారం సత్యనారాయణ భార్య దేముడమ్మకు పాల సంఘం అధ్యక్షుడు పోతల వెంకటరమణ ఈ సొమ్మును అందజేశారు.

అప్రమత్తంగా ఉండండి

- గ్రామాల్లో అధికారులు, నాయకుల పర్యటన
- పునరావాస కేంద్రాల పర్యవేక్షణ
- కంట్రోల్ రూంల ఏర్పాటు



గంట్యాడ: చంద్రంపేట గెడ్డ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు, పోలీసులు



తీరంలో పర్యటిస్తున్న బంగార్రాజు

నష్టం వాటిల్లకుండా చర్యలు

భోగాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ప్రజలకు, మత్స్యకారులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. సోమవారం ఆయన ముక్కాం తీరంలో పర్యటించారు. మత్స్యకాలకు పలు సూచనలు చేశారు. పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే ఎంపీడీవో డీడీ స్వరూపరాణితో మాట్లాడి పలు సూచనలు చేశారు.

రాజాం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 28, 29 తేదీల్లో భారీ, అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఈదురుగాలులు వీస్తాయని.. అందరూ ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. నాగావళి, సువర్ణముఖీ నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎవరికీ నష్టం జరగకూడదు

లక్కవరపుకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నియోజకవర్గంలోని ఏ ఒక్క కుటుంబం నష్టపోకూడదని ఎమ్మెల్యే లలితకుమారి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్, పశుపోషణ వంటివాటిపై దృష్టి సారించాలని కోరారు. మండలంలో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఎమ్మెల్యేకు తెలిపారు. మండలంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో ఎస్.అప్పారావు, ఎస్ఐ నవీన్‌పడాల్, డీటీ రమేష్ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

గజపతినగరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎం.రమేష్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో బి.కల్యాణి, తహసీల్దార్ బి.రత్నకుమార్ పాల్గొన్నారు. ● జామి: మండలంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి కుమారస్వామి ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం అన్ని శాఖలతో కలిసి సమీక్షించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులు గమనించాలన్నారు. తహసీల్దార్ కృష్ణంరాజు, డీటీ మూర్తి పాల్గొన్నారు. ● గరివిడి: తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని గరివిడి తహసీల్దార్ బంగార్రాజు అన్నారు. సోమవారం తమ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగినా సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే మండలంలో పలు గ్రామాల్లో చెరువులను పరిశీలించారు. నేలకొరిగిన పంటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. ● వేపాడ: మొంథా తుఫాన్ మంగళవారం నాటికి తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని తహసీల్దార్ జె.రాములమ్మ హెచ్చరించారు. ఆమె సోమవారం పలు గ్రామాల్లో సందర్శించారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. ● గుర్ల: తుఫాన్ నేపథ్యంలో మండలంలోని చంపావతి నదీ తీర గ్రామాల్లో ఎస్ఐ నారాయణరావు సోమవారం పర్యటించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. ఎస్ఎస్ఆర్‌పేట, పకీరికిత్తలి, ఆనందపురంలలో నదీ పరివాహక ప్రాంతాలను తహసీల్దార్ ఆదిలక్ష్మి పరిశీలించారు. అన్ని చోట్ల కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ● డెంకాడ: మొంథా తుఫాన్ కారణంగా పడుతున్న వర్షాలకు, గాలులకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారిణి కె.భారతి తెలిపారు. చొల్లంగిపేటలో వరి పొలాలను ఆమె సోమవారం సందర్శించారు. పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులకు మార్గదర్శకాలు ఇచ్చారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎ.నాగభూషణరావు, గ్రామీణ వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్, ఏవో టి.సంగీత పాల్గొన్నారు.

● మెరకముడిదాం: గ్రామాల్లో రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సులోచనరాణి సూచించారు. మండలంలోని ఉత్తరావల్లి, మెరకముడిదాం, భైరిపురం, గర్భా గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు.

● నెల్లిమర్ల: తుఫాన్ నేపథ్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నెల్లిమర్ల అర్బన్, రూరల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణ, తహసీల్దార్ శ్రీకాంత్, నగర పంచాయతీ కమిషనర్ జయరాం, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ● తుఫాన్ నేపథ్యంలో పట్టణవాసులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ టి.జయరాం పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన సోమవారం పర్యటించారు. చంపావతి నదీ పరిసరాలను సందర్శించారు. ఎవరూ నదిలో దిగవద్దని హెచ్చరించారు. ప్రజలకు వివిధ సూచనలు చేశారు.

● సంతకవిటి: మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారిణి, డ్వామా పీడీ శారదాదేవి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆమె సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ సుదర్శనరావు, ఎంపీడీవో సురేష్‌కుమార్, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులందరూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఏఈ వినయ్‌కుమార్, సంతకవిటి పీహెచ్‌సీ వైద్యుడు నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● భోగాపురం: ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు గ్రామాల్లో విద్యుత్తు శాఖ విజయనగరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు సోమవారం పర్యటించారు. విద్యుత్తుకు సంబంధించి తీసుకోవలసిన చర్యలపై సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏఈ మస్తాన్‌వల్లి ఉన్నారు.

కోనేరుకు గండి కొట్టారు

చీపురుపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తఅగ్రహారం సమీపంలో ఉన్న శివాలయం కోనేరుకు అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా గండి కొట్టారు. సోమవారం పట్టణంలో అధికంగా వర్షం కురవడంతో కోనేరులోని నీటి మట్టం పెరిగింది. దీంతో కోనేరు తూర్పు గట్టుపై ఉన్న నివాసితులు ఆందోళనకు గురై అధికారులకు సమాచారమిచ్చారు. ఈ క్రమంలో కోనేరును పరిశీలించిన అధికారులు కోనేరుకు గండి కొట్టి, వర్షపు నీటిని కిందనున్న చెరువుకు విడిచి పెట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ డి.ధర్మరాజు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా కురుస్తున్న అధిక వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బంది తలెత్తినా, తక్షణమే సమాచారం అందించాలన్నారు.

లోతట్టు గ్రామాలకు వరద హెచ్చరిక

రేగిడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో విస్తరంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మండలంలోని నాగావళి నదీ తీరంలో ఉన్న 12 లోతట్టు గ్రామాలకు మండల అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. ఈమేరకు తహసీల్దార్ కృష్ణలత, ఎంపీడీవో శ్యామలకుమారిలు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తుఫాన్‌పై లైన్ డిపార్టుమెంట్ అధికారులతో సమీక్షించారు. సంకిలి, రేగిడి, దేవుదళ, సరసనాపల్లి, ఖండ్యాం గ్రామాల్లో పునరావస కేంద్రాలు సిద్ధం చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

చంద్రంపేట గెడ్డలోకి దిగవద్దు

గంట్యాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద ప్రవాహం అధికంగా ఉంటుందని, చంద్రంపేట గెడ్డలోకి ఎవరూ దిగవద్దని అధికారులు సూచించారు. సోమవారం తహసీల్దార్ నీలకంఠరేశ్వ రెడ్డి, సీఐ లక్ష్మణరావు, ఎంపీడీవో రమణమూర్తి చంద్రంపేట గెడ్డను పరిశీలించారు. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

పశువుల సంరక్షణపై చర్యలు చేపట్టాలి

భోగాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పశువుల సంరక్షణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.మురళీకృష్ణ సూచించారు. భోగాపురం, పోలిపల్లి పశువైద్య శాలలను ఆయన సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పశువుల కోసం అవసరమైన ఆహారం, మందులు, టీకాలు, ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ఏడీ ఉమాశంకర్ మహాపాత్రో, వైద్యులు కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

● ఎస్.కోట రూరల్: మండలంలోని పాడిరైతులు తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి రామ్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని చుక్కవానిపాలెం, తలారీ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. పశువుల కాపరులకు, పాడి రైతులకు పలు సూచనలు చేశారు.

ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు

కొత్తవలస, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఉండడం కోసం కొత్తవలస మండల కేంద్రంలో ఐదు అత్యంత ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. 1995వ సంవత్సరం అక్టోబరు 6వ తేదీన కొత్తవలస వీరసాగరం చెరువుకు గండిపడి 10 మంది మృత్యువాత పడిన ఘటనను దృష్టిలో ఉంచుకుని ఆ చెరువుకు సంబంధించిన గట్లను పర్యవేక్షిస్తున్నారు. కొత్తవలస జంక్షన్‌లోనున్న అండర్ బ్రిడ్జిలోకి నీరుచేరి ప్రమాదకరంగా మారనున్నందున ఆ ప్రాంతంలోనూ, కొత్తవలస రైల్వే స్టేషన్ వద్ద, కొత్తవలస నుంచి సబ్బవరం వెళ్లే రోడ్డులో గవరపాలెం వద్దనున్న గెడ్డ, కొత్తవలస-కె.కోటపాడు సమీపంలోని రాంజీనగర్ వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఆకస్మిక తనిఖీ

- తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీ కలిశెట్టి

విజయనగరం/ భోగాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు ఏవిధంగా విధులు నిర్వహిస్తున్నారని తెలుసుకునేందుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం రాత్రి 10.45 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అయితే కార్యాలయంలో ఏఎస్‌వో వి.సన్యాసిరావు, వీఆర్‌ఏ విధుల్లో ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎం.రమణమ్మ, ఆర్ఐ గోపాలకృష్ణ నిమిషాల్లో కార్యాలయానికి చేరుకున్నారు. వర్షం నమోదు, తీర గ్రామాలు, పునరావస కేంద్రాలు తదితర వాటిపై ఆయన తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. 29వ తేదీ వరకు కాస్త జాగ్రత్తగా ఉండాలని.. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎంపీ సూచించారు. భోగాపురం టోల్‌ఫ్రీ నెంబరు 9908583977ను కార్యాలయ ఆవరణలో పెద్ద అక్షరాలతో అతికించాలని సూచించారు.



తహసీల్దార్ రమణమ్మకు సూచనలిస్తున్న ఎంపీ కలిశెట్టి

పరిశ్రమల్లో ఏఐదే ప్రధాన పాత్ర



మాట్లాడుతున్న కృష్ణా యూనివర్సిటీ వీసీ రాంజీ

డెంకాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) ప్రధాన భూమిక పోషిస్తుందని కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కూన రాంజీ అన్నారు. ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ పాత్రపై ఐదు రోజుల ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన సోమవారం వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తయారీ పరిశ్రమలో భవిష్యత్తులో కృత్రిమ మేధాకే అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల బోధకులు ఆ దిశగా శిక్షణ అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణపై అవగాహన

బొబ్బిలి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మెట్టవలసలో సోమవారం రైతులకు కూరగాయల పంట రక్షణపై ఉద్యానవన శాఖ అధికారి ఎస్.వెంకటరత్నం అవగాహన కల్పించారు. తుఫాన్ నేపథ్యంలో కూరగాయలు, అరటి తోటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పొలాల్లో నీటిని బయటకు మళ్లించే ఏర్పాటు చేయాలన్నారు. నీరు బయటకు వెళ్లిన తర్వాత మొక్కలు త్వరగా కోలుకోవడానికి యూరియా, పొటాష్ వంటి ఎరువులను వాడాలని సూచించారు.

122 కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

- డీఆర్వో శ్రీనివాసమూర్తి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 122 కొత్త పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అందుకు తగిన ప్రతిపాదనలను భారత ఎన్నికల సంఘానికి నివేదిక పంపించామని డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్‌వోలు, రాజకీయ పార్టీలు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 1200 కంటే ఎక్కువ సంఖ్యలో ఓటర్ల ఉన్నారని తెలిపారు. 1200 కంటే ఎక్కువ ఉన్న చోట అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల స్థానాల మార్పు కోసం 23, పోలింగ్ కేంద్రాల పేరు మార్పు కోసం 51, ప్రతిపాదిత కొత్త పోలింగ్ కేంద్రాలు 122ను గుర్తించామని వివరించారు. అన్ని రాజకీయ పార్టీలు వారి గుర్తింపు పొందిన బూత్ లెవెల్ ఏజెంట్ల వివరాలను అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఆర్‌వోలు, రాజకీయ పార్టీలు ప్రతినిధులు ఉన్నారు.

న్యాయం చేయాలి



జిందాల్ నిర్వాసితులతో మాట్లాడుతున్న చల్లా జగన్

ఎస్.కోట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో జిందాల్ పరిశ్రమ పేరుతో తమకు మోసం జరిగిందని ప్రభుత్వం న్యాయం చేయాలంటూ గడిచిన 129 రోజులుగా నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. సోమవారం తమ నిరసనలో భాగంగా జిందాల్‌గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. వీరికి సంఘీభావంగా ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ రిలే దీక్షలో పాల్గొన్నారు.

గ్రామసభలపై విచారణ చేపట్టండి

జిందాల్ పరిశ్రమకు 2006లో చేసిన భూసేకరణలో భాగంగా నిర్వహించిన గ్రామసభలు అన్నీ లోపభూయిష్టంగా జరిగాయని.. వీటిపై కలెక్టర్ విచారణ చేపట్టాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. సోమవారం బొడ్డవర గ్రామంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ సమయంలో సంబంధిత భూములు తీసుకున్న రైతులకు ఏ-వన్ నోటీసులు ఇచ్చి 15 రోజుల తర్వాత అభిప్రాయం స్వీకరించాల్సి ఉందని.. అయితే రైతులకు కనీస సమాచారం లేకుండా ఈ తతంగమంతా కేవలం వారం రోజుల్లో పూర్తిచేశారన్నారు. జిందాల్ భూసేకరణ అంతా మోసమని దీనిపై సంపూర్ణ విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరడంతో పాటు ఈ విషయంపై ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు.

అమ్మో.. ఆండ్ర రోడ్డు

- గోతుల మయం.. ప్రమాదాలకు నిలయం

విజయనగరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డులో ప్రయాణించాలంటేనే గుండె గుబేల్ మంటుందంటున్నారు వాహనచోదకులు. అదే ఆండ్ర-గజపతినగరం రోడ్డు. ఈ రోడ్డు పూర్తిగా ఛిద్రమై.. దారి పొడవునా గోతులు ఏర్పడ్డాయి. అసలే చిన్నరోడ్డు ఆపై ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ సమయంలో వేలాది లారీలు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగించడంతో రోడ్డు మొత్తం ఛిద్రమయ్యింది. దీంతో ఆ రహదారి గుండా వెళ్లే ప్రజలు అవస్థలు పడ్డారు. దీనిపై అధికారులను నిలదీయటంతో తూతూమంత్రంగా మరమ్మతులు చేసి, చేతులు దులుపుకున్నారు. ఈ దారిలో రాత్రి పూట ప్రయాణం మరింత ప్రమాదకరం. ద్విచక్ర వాహనదారులు అధిక సంఖ్యలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోవాలాలు కూడా ఈ దారిలో ప్రయాణానికి వెనుకడుగు వేస్తున్నారు. ● పురిటిపెంట, గంగచోళ్లపెంట, కొత్తబగ్గాం తదిత ర గ్రామాల్లో అనుమతులు లేకుండా రోడ్డును తవ్వి కా లువలు, పైపులైన్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అదేవి ధంగా గంగచోళ్లపెంట దగ్గరలో కొంతమంది రైతులు సాగునీటి కోసం పైపులైన్ వేయడంతో నీరు లీకై ఆ రోడ్డుంతా పెద్దగొయ్యి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి.. రోడ్డును తవ్వేసి పైపులైన్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గంగచోళ్లపెంట వద్ద రోడ్డు మధ్యలో గొయ్యి



పురిటిపెంట వద్ద చెరువును తలపిస్తున్న దృశ్యం



గజపతినగరంలో ఇలా..

అధ్వానంగా లింగాలవలస వెళ్లే రోడ్డు

గజపతినగరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గజపతినగరం నుంచి లింగాలవలసకు వెళ్లే బీటీ రోడ్డు అడుగడుగున గుంతలమయంగా మారింది. దీంతో వాహదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. స్థానిక దిగువ వీధి నుంచి పైడితల్లి అమ్మవారి గుడి వరకు బీటీ రోడ్డు గోతులమయం కావడంతో వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వంగర, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కొండచాకరాపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పారిశర్ల వెంకటరమణ(52) వర్షాలు కురుస్తున్నందున తన పొలంలో నిలిచిన నీటిని బయటకు వదిలేందుకు వెళ్లాడు. పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైరు కాలికి తగిలింది. దీంతో ఆయన విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్రీదేవి, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కుటుంబీకుల పోలీసులకు సమాచారం అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

నెల్లిమర్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నెల్లిమర్ల బైరెడ్డి వీధికి చెందిన గిడుతూరి అప్పలనారాయణ(70) సోమవారం వేకువజామున మృతిచెందారు. అప్పలనారాయణ ఈనెల 19న సాయంత్రం నెల్లిమర్లలో రోడ్డు దాటుతుండగా గుర్ల మండలానికి చెందిన ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌తో ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో గాయపడిన అప్పలనారాయణను కుటుంబీకులు తొలుత విజయనగరం ఆసుపత్రికి, అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

కొత్తవలస, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. వృద్ధుడి వివరాలు తెలియరాలేదు. పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే వెళ్లి పరిశీలించారు. వృద్ధుడు వివరాలు చెప్పే స్థితిలో లేకపోవడంతో 108 వాహనంలో విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వృద్ధుడు చికిత్స పొందుతున్నాడు.

జూడో పోటీల్లో మెరిసిన మూర్తి

- కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ



మూర్తిని అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూడో క్లస్టర్ పోటీల్లో కానిస్టేబుల్ బీఎస్ఎన్ మూర్తి రజత పతకం సాధించారు. ఈయన జిల్లా పోలీసు శాఖలో ట్రాఫిక్ విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జమ్మూ రాష్ట్రం శ్రీనగర్‌లో 10వ ఆలిండియా పోలీసు జూడో క్లస్టర్ పోటీల్లో రాష్ట్ర పోలీసు జట్టు తరుపున 65 కిలోల విభాగంలో పాల్గొని, రజత పతకం సాధించారు. ఈయన సోమవారం ఎస్పీ దామోదర్‌ను స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్పీ ఈయన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఆర్ఐ గోపాలనాయుడు, ఎస్‌బీ సీఐ ఏవీ లీలారావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆవును రక్షించారు



చెరువులో నుంచి ఆవును బయటకు తీస్తున్న దృశ్యం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ధర్మవరం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం స్థానిక కొమటిచెరువులో ప్రమాదవశాత్తు పడిపోయిన ఆవును స్థానికంగా ఉన్న అయ్యప్ప స్వాములు రక్షించారు. ఆవు పడిపోవడం చూసిన వారు ఒక్కసారిగా చెరువులో దూకి స్థానిక యువత సాయంతో ఒడ్డుకు చేర్చారు. వీరిని అందరూ అభినందించారు.

రోటరీ సేవలు ముమ్మరం చేయాలి



మాట్లాడుతున్న సంజయ్

బొబ్బిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో డిసెంబరు 7 న రోటరీ డిస్ట్రిక్ట్ పబ్లిక్ ఇమేజ్ సెమినార్ నిర్వహిస్తున్నట్టు రోటరీ డిస్ట్రిక్ట్ 3020 పబ్లిక్ ఇమేజ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ సంజయ్ తెలిపారు. స్థానిక రోటరీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోటరీ సేవలను సమాజంలో మరింతగా ముమ్మరం చేయాలన్నారు. బొబ్బిలి క్లబ్ తరఫున చేపడుతున్న సేవలను కొనియాడారు. సేవాదృక్పథం కలిగిన వారిని క్లబ్ సభ్యులుగా చేర్పించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు, బొబ్బిలి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, శ్రీకాంత్, ఇతర ప్రతినిధులు సింద్రీ శ్రీనివాసన్, రామప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

తుఫాన్ గుబులు

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. ఈదురు గాలులు, భారీ వర్షాలతో నష్టం తప్పదంటున్నారు. పంట తడిసిపోయే ప్రమాదం ఉండడంతో మరి కొందరు స్థానిక వ్యాపారులను ఆశ్రయించి హడావుడిగా అమ్మకాలు చేపట్టారు.

నేలవాలిన వరిపైరు

చిన్నపాటి గాలులకు గరుగుబిల్లి, పెద్దూరు, బీవీ పురం, ఉద్దవోలు, దళాయివలసతో పాటు పలు గ్రామాల్లోని వరి పంట అధికంగా నేలవాలింది. పంటను రక్షించుకుందామన్నా వర్షం కారణంగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఉన్నారు. రానున్న రెండు రోజుల్లో ఈదురుగాలుతో భారీ వర్షాలు కురిస్తే మండలంలో సుమారు 500 ఎకరాలకు పైగా వరి పంట ముంపునకు గురయ్యే అవకాశం ఉందని ఏవో టి.జ్యోత్స్న తెలిపారు.

రంగంలోకి కలెక్టర్, ఎస్పీ

తుఫాన్ తీవ్రత నేపథ్యంలో కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఎటువంటి నష్టం జరగకుండా సిబ్బంది పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. కలెక్టరేట్‌తో అన్ని అన్ని మండల కార్యాలయాలతో పాటు పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టరేట్లలో ఈ నెంబర్లతో 79890 39866, 91820 05018 కంట్రోల్ రూములు ఏర్పాటుచేశారు. మంగళవారం మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు : సబ్ కలెక్టర్



పాలకొండ: నదీతీర గ్రామంలో సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పాలకొండ: అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇంటి నుంచి ఎవరూ బయటకు రావొద్దని పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. 'డివిజన్‌లో కురుపాం, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని కొండ ప్రాంతాల్లో గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలి. పూరిగుడిసెలు, విద్యుత్ స్తంభాలు, చెట్లు కింద ఉండరాదు. పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. కొండ వాగులు, గెడ్డలు, నదులను ఎవరూ దాటరాదు. సబ్ డివిజన్ పరిధిలో 45 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం. సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేశాం. ఆహారం, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాం. అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం' అని తెలపారు. అనంతరం ఆయన నదీతీర గ్రామాలైన అన్నవరం, గోపాలపురం, గొట్టమం గళాపురం, అంపిలి సందర్శించారు. వరదలు వస్తే నదీతీర గ్రామాల ప్రజలను తరలించాలని సిబ్బందికి సూచించారు.

మరో మూడు నెలలు

(5వ పేజీ తరువాయి)

చెల్లిస్తే సరిపోతుంది. తద్వారా అనధికార లేఅవుట్ లేదా వ్యక్తిగత స్థలాలను అధికారికం చేసుకోవచ్చు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా లేఅవుట్లను, స్థలాలను క్రమబద్ధీకరించుకున్న వారికి పూర్తిస్థాయి హక్కులు వస్తాయి. బ్యాంకు రుణాలు పొందడానికి, ఇతరత్రా అధికారికమైన లావాదేవీలు నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుంది. 45 రోజుల్లోగా పూర్తి మొత్తాన్ని చెల్లిస్తే పదిశాతం, 90 రోజుల్లో 5 శాతం తగ్గింపు వర్తిస్తుంది. ఓపెన్ స్పేస్ లేనప్పుడు భూమి విలువపై 7 శాతం అదనపు చార్జీలు అంటే 14 శాతంలో సగం రాయితీ లభిస్తుంది.

నూతన వ్యవస్థకు శ్రీకారం

(5వ పేజీ తరువాయి)

గ్రామ/వార్డు సచివాలయాలకు పర్యవేక్షణ అధికారులను నియమించారు. మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవోలుగా మండల పరిషత్ కార్యాలయాల్లోని అడ్మినిస్ట్రేటివ్ అధికారులకు బాధ్యతలు అప్పగించింది. వీరు స్థానిక సంస్థలకు, డీడీవోలకు మధ్య వారధిగా పనిచేస్తారు. నూతన వ్యవస్థలో మండలాల్లో డిప్యూటీ ఎంపీడీవో స్థాయిలో ఇద్దరు పనిచేస్తారు. ఒకరు పంచాయతీలను, ఒకరు సచివాలయాల వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. త్వరలో గ్రేడ్ -1 కార్యదర్శులు, సీనియర్ సహాయకుల్లో అర్హులకు పదోన్నతులు కల్పించి పూర్తిస్థాయిలో సచివాలయ అధికారులను నియమించనున్నారు.

రెండు పునరావాస కేంద్రాల ఏర్పాటు



అప్పయ్యపేట లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్

బొబ్బిలి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో ఎటువంటి నష్టం జరగకుండా ఉండేందుకు వీలుగా పట్టణంలో రెండు పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పాత బొబ్బిలిలోని వేంకటేశ్వర మున్సిపల్ పాఠశాల, అప్పయ్యపేట రోడ్డులోని అయ్యప్ప ఐటీఐ భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం బొబ్బిలి ఆర్డీవో రామ్మోహ నరావు, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, సీఎస్ డీటీ రెడ్డి సాయికృష పరిశీలించారు. పూరిళ్లలో నివసిస్తున్న వారిని వెంటనే ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కం ట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అత్యవసరమైన సహాయం కావాల్సిన వారు 9989817042 నెంబరుకు సంప్రదించాలన్నారు. ఇదిలా ఉండగా సోమ వారం మున్సిపల్ డీఈఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లతో కలిసి కమిషనర్ లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. నీటి నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి తక్షణమే ఆ నీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు. భోజ రాజపురం మున్సిపల్ ప్రధాన వాటర్ వర్క్స్‌లో విద్యుత్ సరఫరాకు అంత రాయం లేకుండా జనరేటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహించేందుకు యంత్రాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

రెడ్‌క్రాస్ సేవలకు సిద్ధం

బొబ్బిలి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు ఎం.విజయమోహనరావు, శంకరరావు, వినోద్‌కుమార్ ప్రకటించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగానికి సహాయకులుగా తాము పనిచేస్తామన్నారు. రక్తదానం, ఆహారం, దుస్తుల పంపిణీ, ట్రాఫిక్ సమన్వయం, షెల్టర్ ఏర్పాటు, వైద్య సహాయం వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి

రామభద్రపురం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): బాధ్యతారాహిత్యం వ్యవహరిస్తున్న రామభద్ర పురం సచివాలయం-3 ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్.నవీన్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి చంద్ర, జనసేన నాయకుడు మహంతి ధనంజయ, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాపు రామారావు కోరారు. సోమవారం ఎంపీడీవో రత్నంకు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండటంలేదన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నాయకులు గొర్లె రామారావు, చింతల ఆదినారాయణ, మజ్జి తిరుపతి తదితరులు ఉన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండండి





పాచిపెంట: గిరిజన విద్యార్థులను తరలిస్తున్న అధికారులు... పాలకొండ: మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలను డీఎస్పీ ఎం.రాంబాబు, తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎంపీడీవో రంగారావు, అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు సోమవారం సందర్శించారు. గోపాలపురం, అన్నవరం, చిన్నమంగళాపురం, గొట్ట మంగళాపురం తదితర గ్రామాలను సందర్శించి వరద పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రజలకు అప్రమత్తం చేశారు. వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అనంతరం అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. నదీతీర ప్రాంతాల్లో ప్రజలు ఆపదలో చిక్కుకున్న సమయంలో రక్షించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. నదీ ప్రవాహానికి దగ్గరగా వెళ్లరాదన్నారు. వారితో పాటు సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ ప్రయోగమూర్తి తదితరులున్నారు.

●గరుగుబిల్లి: మొంథా తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావం నుంచి బయటపడేందుకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇళ్లల్లోనే ప్రజలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా రావుపల్లి పరిధిలోని దేసూరిగెడ్డను మండల అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న, ఎస్‌ఐ ఫక్రుద్దీన్, వైద్యాధికారి ఎన్ఎంకే తిరుమలప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, ఏపీవో ఈశ్వరమ్మ, ఎంఈవోలు జోగారావు, కొండలరావు, ఏపీఎం పి.అప్పలనాయుడు, గృహ నిర్మాణశాఖ జేఈ వి.అఖిల్, వైద్య సిబ్బంది ప్రకాశరావు, ఉదయకుమారి, ఎన్.జగదీశ్వరి పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో డీటీ మర్రాపు రాజేంద్ర, ఆర్‌ఐ గౌరీశ్రీనివాసరావుతో పాటు పలువురు సిబ్బంది 25 పంచాయతీల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. నాగావళి నదీ తీరానికి ఆనుకుని ఉన్న మరుపెంట, సాంబన్నవలస, సుంకి ప్రాంతాల్లోని వారికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు.. సచివాలయాల కార్యదర్శులను అప్రమత్తం చేశారు.

●పాచిపెంట: మొంథా తుఫాన్ నేపథ్యంలో స్థానిక అధికారులు సోమవారం ముందస్తు చర్యలు చేపట్టారు. పాచిపెంట బీసీ కాలనీ వద్ద ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ సంక్షేమ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నుంచి 243 మంది విద్యార్థులను జడ్పీ ఉన్నత పాఠశాలకు తహసీల్దార్ డి.రవి, ఎంపీడీవో బీవీజే పాత్రోలు తరలించే ఏర్పాటు చేశారు. కాలకృత్యాలు, స్నానాలు, భోజనాలకు మాత్రమే హాస్టల్ వద్ద అనుమతించారు. మండలంలో ఆరు జనరేటర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను సిద్ధంగా ఉంచారు. కార్యక్రమంలో పీఐయూడీఈఈడబ్ల్యూ వీఎస్ఎస్ శర్మ పాల్గొన్నారు.

●మక్కువ రూరల్: తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమ త్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారి చింతల భారతి సూచించారు. ఈదురు గాలులు, భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరి ప్రస్తుతం పూత, కోత దశలో వున్నందున రైతులు వారి చేనులో ముందుగానే కాలువలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దాని వల్ల వర్షపునీరు వెంటనే తొలగించేందుకు వీలు కలుగుతుందన్నారు. కోత దశకు వచ్చిన వరి పైరు కిందపడిపోతే నిలబెట్టాలన్నారు. కోత కోసిన పంట తడిసిపోయినట్లైతే అటువంటి వరిపంటకు లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. అలాగే కోత దశకు వచ్చిన పత్తి పంటను, అరటి పంటలను వెంటనే కోసివేసి పొడి ప్రదే శాల్లో భద్రపరిచి తగిన జాగ్రత్తలు తీసుకోవా లని ఆమె సూచించారు. ఈ సందర్భంగా దుగ్గేరు సమీపంలో అడారిగెడ్డ వద్ద సోమవారం అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.భరత్‌కుమార్, ఎంపీడీవో ఎన్.అర్జునరావు, ఎస్‌ఐ వెంకట రమణ, మండల ఇంజనీరింగ్ అధికారి రజిత్‌కుమార్ తదితరులున్నారు.

● వీరఘట్టం: తుఫాన్ నేపథ్యంలో కిమ్మి గ్రామాన్ని సోమవారం తహసీల్దార్ సాయి కామేశ్వరరావు సందర్శించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగావళి నదీ పరివాహక ప్రాంతాలకు ప్రజలు వెళ్లకూడదన్నారు. ఇళ్లల్లోనే ఉండాలని, బయటకు ఎవరూ రావద్దన్నారు. ఎంపీడీవో బి.వెంకటరమణ మాట్లాడుతూ అధికారులందరూ వారి పరిధిలోని ప్రజలందరినీ అప్రమత్తం చేయాలన్నారు.



గరుగుబిల్లి: రావుపల్లి దేసూరిగెడ్డను పరిశీలిస్తున్న అధికారులు

జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు అభినందనలు



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌తో న్యాయవాదులు

పార్వతీపురం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు జస్టిస్‌గా నియమితులైన మానవేంద్రనాథ్ రాయ్‌ను పార్వతీపురానికి చెందిన న్యాయవాదులు అభినందించారు. విజయవాడ వెళ్లి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌ను కలిశారు. పార్వతీపురం పట్టణానికి చెందిన ఆయన.. హైకోర్టు జస్టిస్‌గా నియమితులు కావడం ఎంతో గర్వకారణమన్నారు. రాయ్‌ను కలిసిన వారిలో న్యాయవాదులు నల్ల శ్రీనివాసరావు, జాగాన మధుసూదనరావు, నీలం రాజేష్, బాబ్జీ తదితరులు ఉన్నారు.

ఎల్విన్‌పేటలో ఓపెన్‌హౌస్



ఆయుధాల కోసం వివరిస్తున్న ఎస్‌ఐ

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా సోమవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు వాడే ఆయుధాలు, వాటి పనితీరును విద్యార్థులకు ఎస్‌ఐ శివప్రసాద్ వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై అవగాహన కల్పించారు.

అలసత్వం చూపితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి

రామభద్రపురం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి జి.ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమ వారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు ఎవరూ తావివ్వకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ దండోరా వేయించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, తహసీల్దార్ అజురఫీ జాన్, ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు పాల్గొన్నారు.

ఖైదీలను సక్రమంగా చూడండి



జైలు పరిసరాలను పరిశీలిస్తున్న న్యాయాధికారి

పాలకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖైదీలను సక్రమంగా చూడాలని పాలకొండ సబ్ కోర్టు న్యాయాధికారి చందక హరిప్రియ అన్నారు. పాలకొండ సబ్ జైలును సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో ఆమె మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం కోరితే న్యాయవాదిని ఏర్పాటు చేస్తామ న్నారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు న్యాయవాది వెంకటేశ్వరరావు, హెడ్ వార్డర్ రమణయ్య, వార్డర్లు నాగరాజు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పాలకొండ, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలేనని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్ ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలో జీపు యాత్ర సోమవారం కొనసాగింది. పాలకొండలోని ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఎదుట వారు నిరసన తెలిపారు. వసతి గృహాల్లో ఏఎన్ఎంలను నియమించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. గురుకుల పాఠశాలలో 14 మంది విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారన్నారు. వారి కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సభ్యులు శరత్, నాయకులు రేష్మి, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తాం



శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కొమరాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని కెమిశలలో రైతు సేవాకేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం శిఖవరం గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్య క్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్‌పాత్రుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ గౌరీ శంకరరావు, హరిప్రసాద్, రాఘవ, బలరాం, నాగేశ్వరరావు, జనసేన కన్వీనర్ శ్రీకర్, బీజేపీ మండల కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ ప్రభావం 28, 29 తేదీల్లో అధికంగా ఉంటుందని వివరించారు. నాగావళి, వంశధార నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

కందిరీగలు దాడి: మహిళకు గాయాలు

కురుపాం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో కందిరీగలు దాడిలో మహిళకు గాయాలయ్యాయి. స్థానిక రెల్లివీధికి చెందిన వెంకయ్యమ్మ శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లడంతో కందిరీగలు ఆమెపై దాడి చేశాయి. తీవ్ర గాయాలపాలైన ఆమెను వెంటనే కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతున్నారు.

200 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు



సారా స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

కురుపాం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): జోగిరాజుపేట సమీపంలో సోమవారం చేపట్టిన దాడుల్లో 200 లీటర్ల స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేశామని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆటోలో చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ చందు, రాయిపిల్లి డాక్టర్ సారా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి 10 కేన్లులో 200 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వారిపై నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

నేడు అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న బుడితి అప్పలనాయుడు

పాలకొండ, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎలైట్ కళాశాలలో మంగళవారం ఉదయం పాలకొండ జిల్లా సాధన సమితి అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఆ సమితి అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు తెలిపారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు, మేధావులు హాజరుకావాలన్నారు. నవంబరు 7న నిర్వహించనున్న సమావేశానికి ఎలా ముందుకెళ్లాలో చర్చించడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు సాధన సమితి గౌరవ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, సబ్బ నానాజీ తదితరులున్నారు.

శివాలయాల్లో కార్తీక పూజలు



కురుపాంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కురుపాం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా కురుపాంలోని శివాలయాలను అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్థానిక ఉమమహేశ్వర స్వామి ఆలయం, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, దూళికేశ్వరస్వామి, కొండ మీద శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

●సీతంపేట రూరల్: కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా సీతంపేటలోని శివాలయాలకు భక్తుల తాకిడి అధికమైంది. మల్లికార్జున సహిత కాశీవిశ్వేరస్వామి ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు.

●సీతానగరం: కార్తీకమాసం పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది తీరాన వేంచేసిన సువర్ణ ముఖేశ్వర స్వామి, బూర్జలో ఎండల మల్లికార్జునేశ్వరస్వామి, పార్వతీ పరమేశ్వర ఆలయం, గాదెలవలసలో శివాలయంలలో భక్తులు ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకొనేందుకు క్యూకట్టారు. అలాగే అన్ని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

●కొమరాడ: కార్తీకమాసం సందర్భంగా మండలంలోని గుంప సోమేశ్వర దేవాలయం, చోళపదం, శివిని అగ్రహారం గ్రామాల్లోని శివాలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రదీ దృష్ట్యా ఎస్‌ఐ నీలకంఠం బందోబస్తును ఏర్పాటు చేశారు.

సవరణ

తే: 17-10-2025 దీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో బహిరంగ ప్రకటనలో ప్రచురించిన ఐందుమూలముగా నా క్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED పాలకొండ బ్రాంచి పాలకొండ వారు ఇచ్చిన బోగట్టా ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని శ్రీ/శ్రీమతి శివ్వాల సూర్యనారాయణ S/o శివ్వాల సూరపునాయుడు వీరి యొక్క ప్రాపర్టీని షూరిటీగా తీసుకొని వీరికి ఋణము యిచ్చుటకు నిర్ణయించుకొన్నారు. దీనికి బదులుగా శ్రీ/శ్రీమతి శివ్వాల సత్యంనాయుడు S/o శివ్వాల సూరపునాయుడు వీరి యొక్క ప్రాపర్టీని షూరిటీగా తీసుకొని వీరి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. దీనిని పరిగణలోకి తీసుకోగలరు.